వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే వివిధ పీజీ డిప్లొమా కోర్సుల పరీక్షలను ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్ సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

ప్రశాంతంగా టీజీ సీపీజీఈటీ 2024 పరీక్షలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల పరిధిలో అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీ సీపీజీఈటీ - 2024 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ పరీక్షలు ఈ నెల 16 వరకు జరుగనున్నట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి తెలిపారు. ఈ పరీక్షలు శుక్రవారం ఆరు సబ్జెక్టులకు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పరీక్షలకు మొత్తం 18,411 మంది దరఖాస్తు చేసుకోగా, మొత్తం 16,542 మంది హాజరయ్యారని వివరించారు. హాజరు శాతం 89.84గా నమోదైందని పేర్కొన్నారు.

సనాతన ధర్మ రక్షణపై నేడు చర్చా గోష్ఠి

సికింద్రాబాద్, జూలై 12: సనాతన ధర్మ రక్షణలో నేటి గుళ్ళు, ఆర్య సమాజం ప్రస్తుత పాత్రపై చర్చాగోష్ఠిని ఈనెల 13 నేడు శనివారం సికింద్రాబాద్ బౌద్ధనగర్ డివిజన్‌లోని రామాలయంలో నిర్వహించనున్నట్లు జయప్రకాశ్ ఆర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.సనాతన ధర్మ సేవ సంఘటన భాగ్యనగరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పృథ్వీరాజ్, ఆర్య, జయరాజ్ ఆర్యలు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో భరద్వాజ్, జయప్రకాష్, సుబ్బరాజు, రాంబాబు, గోపాల్, సాయి, కుమార్, రాజు, వినయ్ సత్యనారాయణ, కుల్దీప్, సుధాకర్ లు హాజరవుతారన్నారు. ఈ చర్చా గోష్ఠి కార్యక్రమానికి హిందు బంధువులు అందరూ రావాలని ఆహ్వానించారు.

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా బోనాలు

బోనాల చెక్కుల పంపిణీలో సనత్‌నగర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీ గణేశ్

అమీర్‌పేట్: బోనాల చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, చిత్రంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి తదితరులు

మారేడ్‌పల్లి : నెహ్రూనగర్ పార్కు ఆవరణలో బోనాల చెక్కులను పంపిణీ చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, చిత్రంలో అధికారులు తదితరులు

మారేడ్‌పల్లి/అమీర్‌పేట్, జూలై 12: కంటోన్మెంట్‌లో రానున్న బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. శుక్రవారం మారేడ్‌పల్లిలోని నెహ్రూనగర్ పార్కు ఆవరణలో కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన బోనాల ఉత్సవాల ఆలయ కమిటీ సభ్యులందరికీ కలిపి 218 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుందన్నారు. జీహెచ్ ఎంసీ, కంటోన్మెంట్ బోర్డు, విద్యుత్ , పోలీస్ శాఖ అన్ని విభాగాల సమన్వయంతో ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు కంటోన్మెంట్ లోని అన్ని ఆలయ నిర్వాహకులకు చెక్కులను పంపిణీ చేశామని, కొన్ని కొత్త ఆలయాల నిర్వాహకులు కూడా దరఖాస్తు చేసుకున్నారని వారికి కూడా నిధులు మంజూరు చేయాలని ఎండోమెంట్ అధికారులను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ శాఖ ఇన్‌స్పెక్టర్ అండాలు, తిరుమలగిరి తహసీల్దార్ అశోక్, డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, కాంగ్రెస్ నాయకులు బద్రినాథ్ యాదవ్, సి. సంతోష్ యాదవ్, ముప్పిడి మధుకర్, నాగినేని సరిత, ధనలక్ష్మి, రేపాల వెంకటేశ్వర్లు, సురవి శ్యాంసుందర్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

21న అధికారులతో సమీక్ష

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బోనాల పండుగను అందరూ ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఉదయం సికింద్రాబాద్ మహంకాళి దేవాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని 256 దేవాలయాల కమిటీలకు బోనాల పండుగ ఆర్థిక సహాయంగా మొత్తం రూ. 1.69 కోట్ల చెక్కులను రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డిలతో కలిసి ఆయా కమిటీలకు అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ లక్షలాదిగా భక్తులు తరలి వచ్చే మహంకాళి అమ్మవారి జాతర నిర్వహణకు జరగాల్సిన ఏర్పాట్లపై ఈ నెల 21న సంబంధిత విభాగాల అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, దీపికలతో పాటు కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దోమల నివారణపై అవగాహన కోసం ఇంటింటికీ స్టిక్కర్ అతికిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ/సికింద్రాబాద్, జూలై 12: దోమల నివారణకు జీహెచ్ఎంసీ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి చెప్పారు. ఫ్రైడే - డ్రై డే పేరుతో ప్రతి శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన దోమల నివారణ అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక డ్రైవ్‌లో దోమలను నివారించే ప్రత్యేక యంత్రాలు, పనిముట్లు, కీటక నాశినిల పనితీరును పరిశీలించారు. నివారణ చర్యలు తెలియజేసే డోర్ స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు తమ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. తద్వారా హాని కలిగించే దోమలు, కీటకాలను నివారించడం సాధ్యమవుతుందన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమంలో శక్తి వంచన లేకుండా సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్, ఏఎంహోహెచ్ రజినీకాంత్, ఎంటమాలజీ విభాగం ఏఈ సునీత, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన

ఇంటి చుట్టూ ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా చూడాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ అన్నారు. జీహెచ్ఎంసీ చేపట్టిన ఫ్రై డే , డ్రై డే కార్యక్రమంలో కార్పొరేటర్ హేమ పాల్గొన్నారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలలో జీహెచ్ఎంసీ చేపట్టిన ఫ్రైడే , డ్రై డే కార్యక్రమంలో కార్పొరేటర్ హేమ అధికారులతో కలిసి స్కూల్ విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వారానికి ఒకరోజు ఇంటి పరిసర ప్రాంతాలతో పాటు ఇంటిని శుభ్రపరిచే విధంగా ఒక రోజు సమయం కేటాయించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి శుక్రవారం పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ సునీత,శ్రీనివాస్, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలలో దోమల నివారణపై విద్యార్థులకు అధికారులతో కలిసి అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ హేమ తదితరులు

అతి వేగంగా వాహనాలు నడుపొద్దు

సదస్సులో మాట్లాడుతున్న ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 12: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఆంధ్రమహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ వుమెన్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎంవీ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, సీఐలు సీహెచ్ శ్రీనివాసులు, రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు అనుమతించకూడదని సూచించారు. ఈ విషయంలో వాహనం ఇచ్చినవారు సైతం శిక్షార్హులవుతారన్నారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు సిగ్నల్స్ పాటించాలన్నారు. అతివేగంతో నడపడం ఎప్పుడూ ప్రమాదకరమేనని అభిప్రాయపడ్డారు. రహదారులపై క్రమశిక్షణతో వ్యవహరించాలని, ప్రతిఒక్కరూ తమ రక్షణతో పాటు ఇతరుల రక్షణకు వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఝాన్సీరాణి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కరుణాదేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. ప్రమీల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ వసుంధర, డాక్టర్ సరిత, రమణి పాల్గొన్నారు.

శుభాకాంక్షలు: తెలంగాణ ఎన్సీకార్పొరేషన్ చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకులు నగరిగారి ప్రీతమ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ ప్రీతమ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అమీర్‌పేట్

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

అడ్డగుట్ట, జూలై 12: సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని మెట్టుగూడ డివిజన్‌లోని చిలకలగూడ, విజయపురి కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. భవన నిర్మాణాలకు అనుమతి తీసుకుని, అనుమతులకు విరుద్ధంగా కడుతున్న నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదులు అందడంతో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ రజిత ఆధ్వర్యంలో ఈ కూల్చివేతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సరిత, వార్డ్ టౌన్ ప్లానర్లు ప్రకాశ్, మౌనిక, చైన్‌మెన్‌లు నాగయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వీసీల నియామకం పారదర్శకంగా చేపట్టాలి

పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 12: తెలంగాణ రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకు నూతనంగా వీసీల నియామకాన్ని పారదర్శకంగా చేపట్టాలని పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి వీసీలుగా ఐఏఎస్ అధికారులను నియమించినప్పటికీ, వారికి పూర్తిస్థాయిలో విద్యార్థుల సమస్యలు తెలియకపోవడంతో పాలన కుంటుపడుతోందన్నారు. బోధన, బోధనేతర సిబ్బందిని భర్తీ చేయాలని కోరారు. నియామకాలలో ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. వీసీల నియామకాన్ని పారదర్శకంగా చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

డెంగ్యూ నియంత్రణ కోసం ..

డెంగ్యూ నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీహెచ్ ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఎన్ రవికిరణ్ సూచించారు.శుక్రవారం జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ కార్యాలయంలో డెంగ్యూ నివారణపై జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డెంగ్యూ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శానిటేషన్ మెడికల్ ఆఫీసర్లు , డిప్యూటీ కమిషనర్లు , డిప్యూటీ డీఈలు, సీనియర్, అసిస్టెంట్ల ఎంటమాలజిస్ట్‌లతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు.డెంగ్యూ నియంత్రణ కోసం కృషి చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం , శనివారం పాఠశాల విద్యార్థులకు డెంగ్యూ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. - సికింద్రాబాద్,జూలై 12

యువతి అదృశ్యం

రొయ్యల శ్రావణి (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 12: తనకు వివాహం ఇష్టం లేదని చెబుతున్నా సంబంధాలు చూస్తున్నారని మానసిక ఒత్తిడికి లోనైన ఓ యువతి ఇం టి నుంచి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం పార్సిగుట్టలో నివాసముండే రొయ్యల శ్రావణి (28)కి కొంత కాలంగా వివాహ సంబంధాలు చూస్తున్నాడు. వివాహం చేసుకోవడం పట్ల ఆసక్తి లేని శ్రావణి ఈ విషయంలో మానసిక ఒత్తిడికి లోనై ఈ నెల 9న రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు, స్నేహితులను వాకబు చేసినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మల్టీ సౌండ్ హారన్‌పై స్పెషల్ డ్రైవ్

చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మల్టీ సౌండ్ హారన్‌పై శుక్రవారం బోయిగూడలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఐ సీహెచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిబంధనలు ఉల్లంఘించి, హారన్ ఏర్పాటు చేసుకున్నవారిపై కేసులు నమోదు చేశారు. మల్టీ సౌండ్ హారన్ ఏర్పాటు చేసుకోవడం చట్టపరంగా నిషేధించారని, చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఐ శ్రీనివాసులు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అప్పుడే సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. - ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 12

మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

చిక్కడపల్లి, జూలై 12: కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. అసోసియేషన్ సబ్ కమిటీ సమావేశం శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కన్వీనర్ స్వరాజ్‌కుమార్ భట్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 4 డీఏల అమలుతో పాటు గత వేతన సవరణ కమిషన్ సూచనలను వెంటనే అమలు చేయాలని అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.జనార్దన్‌రెడ్డి, ఎం. నరహరి, దుర్గాప్రసాద్, అరుణ, సీతారం,లక్ష్మీనారాయణ, అశోక్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీ విజేతలు..

నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన హైదరాబాద్ జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో బల్కంపేట వీర హనుమాన్ వ్యాయామశాలలో ఖలీఫా బత్తుల రాజేష్ (రాజన్న) పర్యవేక్షణలో శిక్షణ పొందిన మల్ల యోధులు సత్తా చాటారు. 92 కేజీల విభాగంలో అనీష్ ముదిరాజ్ బంగారు, విజయ్‌కుమార్ వెండి పతకాలు సాధించారు. కాగా విజయ్‌కుమార్ ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటి కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. 130 కేజీల విభాగంలో సోను ముదిరాజ్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. 14న జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో సైతం సత్తా చాటాలంటూ ఖలీఫా రాజన్న విజేతలను అభినందించారు. - అమీర్‌పేట్

60 నుంచి 65 ఏండ్లకు పెంచాలి

సమావేశంలో టౌటా ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 12: రాష్ట్రంలోని యూనివర్సిటీలలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టౌటా) అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం మల్లేశం డిమాండ్ చేశారు. టౌటా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని ఓయూలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ మల్లేశం మాట్లాడుతూ యూజీసీ నిబంధనల ప్రకారం అధ్యాపకుల పదవీ విరమణ వయోపరిమితిని 60 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచాలన్నారు. యూజీసీ పెండింగ్ బకాయిలను (ఆర్ఎస్పీ-2016) విడుదల చేయాలని కోరారు. విశ్వవిద్యాలయాలలో పనిచేసే ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టౌటా ప్రతినిధులు ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస్, డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వనజ ఉదయ్, ప్రొఫెసర్ విద్యాసాగర్, ప్రొఫెసర్ మంగు, ప్రొఫెసర్ పున్నయ్య, ప్రొఫెసర్ సరస్వతమ్మ, డాక్టర్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వైఎమ్‌సీఏ ఫిజికల్ డైరెక్టర్‌గా జార్జ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా డాక్టర్ ఎజినె జార్జ్ నియమితులయ్యారు. శుక్రవారం సమావేశమైన వైఎంసీఏ బోర్డు డైరెక్టర్లు జార్జ్ ఎంపికపై తుది నిర్ణయం తీసుకున్నారు. బాస్కెట్ బాల్ క్రీడలో జార్జ్‌కు సుదీర్ఘ అనుభవముంది. అటు ప్లేయర్‌గా లెక్కకు మిక్కిలి పతకాలు సాధించడంతో పాటు తన శిక్షణలో మెరికల్లాంటి ప్లేయర్లను తీర్చిదిద్దాడు. సికింద్రాబాద్ వైఎంసీఏ ఆధ్వర్యంలో పలు క్రీడల్లో ప్లేయర్లకు శిక్షణ అందించడంలో జార్జ్ కీలకంగా వ్యవహరించారు.

దొంగను పట్టుకున్న ఓయూ పోలీసులు

కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ గ్యార జగన్, చిత్రంలో సీఐ రాజేందర్, సిబ్బంది

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 12: వృద్ధుడి నుంచి సెల్‌ఫోన్ స్నాచింగ్ చేసిన యువకుడిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు పట్టుకున్నారు. ఓయూ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గ్యార జగన్, సీఐ రాజేందర్ కేసు వివరాలను వెల్లడించారు. వారి కథనం మేరకు హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8లోని హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే గోపాల్ వృత్తి రీత్యా ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈ నెల 6న రాత్రి ఎనిమిది గంటల సమయంలో బెంగళూరు వెళ్లేందుకు రైలు ఎక్కేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లగా రైలు రాకపోవడంతో తిరిగి ఇంటికి రావడానికి ఆటో కోసం ఎదురు చూస్తుండగా యాక్టివాపై వచ్చిన ఒక వ్యక్తి తాను అదే దారిలో వెళ్తున్నానని, రూ.200 ఇస్తే దింపుతానని ప్రతిపాదించాడు. దాంతో ఆ వ్యక్తి బైక్‌పై ఎక్కిన గోపాల్ తన ఇంటి సమీపంలో రాత్రి పన్నెండు గంటలకు దిగాడు. ఆ వ్యక్తికి డబ్బులు ఇస్తున్న క్రమంలో ఆ వ్యక్తి చేతిలో నుంచి రూ.1700 నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యాడు. దీంతో గోపాల్ ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు నిందితుడు తార్నాకలో దొంగలించిన మొబైల్ ఫోన్‌ను అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా శుక్రవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి సెల్ ఫోన్, యాక్టివా వాహనం, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆంథోనీ ఫెలిక్స్ ఖాన్ (29) బోయిన్‌పల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

మ్యాన్‌హోల్ మరమ్మతు పనుల పరిశీలన

తురాబ్‌నగర్‌లో మ్యాన్‌హోల్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

అంబర్‌పేట, జూలై 12 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ఇరానీహోటల్, తురాబ్‌నగర్, వడ్డబస్తీ, గౌడ సంఘం వెనకాల పాడైపోయిన వర్షపు నీటి నాలా మ్యాన్‌హోల్ మరమ్మతు పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి శుక్రవారం పరిశీలించారు. కొన్ని నెలలుగా ఈ మ్యాన్‌హోల్స్ మూతలు విరిగి ప్రమాదభరితంగా తయారయ్యాయి. ఈ విషయం కార్పొరేటర్ దృష్టికి రాగా వెంటనే చొరవ తీసుకొని సంబంధిత జీహెచ్ ఎంసీ అధికారులను పిలిపించి మ్యాన్ హోల్స్ కు మరమ్మతులు పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి, నాయకులు మిర్యాల శ్రీనివాస్, శ్రీకాంత్ చౌదరి పాల్గొన్నారు.